www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 24 జూన్ 2024



సిఎం, డిప్యూటీ సిఎం ఫోటోల విక్రయాలు

ప్రజాశక్తి-తాళ్లపూడి

ప్రభుత్వ కార్యాలయాల్లో సిఎం చంద్రబాబు చిత్రపటంతో పాటు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చిత్రపటం కూడా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో వారి ఫోటోలను విరివిగా విక్రయిస్తున్నారు. నాయకుల ఫోటోలు బజార్లో విక్రయానికి పెట్టారు. తాళ్లపూడిలో ఫోటోలు అమ్మే పలు దుకాణాల్లో వీరిద్దరి ఫోటోలు దర్శనమిస్తున్నాయి.



దుకాణంలో సిఎం, డిప్యూటీ సిఎం ఫోటోలు

విద్యుత్‌పై అదనపు బాదుడు


- హీటెక్కిస్తున్న ఎసిల వినియోగం
- కిలోవాట్‌కు రూ.1800 చొప్పున వసూలు
- వినియోగదారులపై రూ.3.10 కోట్ల భారం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

విద్యుత్ వినియోగదారులపై రాష్ట్ర ప్రభుత్వం మరో బాదుడుకు తెర లేపింది. ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం ఎయిర్ కండిషనర్లు కొనుగోలు చేస్తున్న వారిని గుర్తించి అదనపు ఛార్జీల వసూలు ప్రారంభించింది. గృహ విద్యుత్ వినియోగదారుల నుంచి సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, కిలోవాట్‌కు రూ.1500, ఇతర ఛార్జీలు రూ.100 కలిపి రూ.1800 చొప్పున డిమాండ్ నోటీసులు జారీ చేసింది. కమర్షియల్ వినియోగదారులకు కిలోవాట్‌కు రూ.2000, సెక్యూరిటీ డిపాజిట్ రూ.200 చొప్పున నోటీసులు అందజేస్తోంది. గడిచిన 3 నెలల్లో జిల్లావ్యాప్తంగా అధికారులు సర్వే చేసి 7,564 మంది వినియోగదారులు అదనపు వినియోగం చేస్తున్నారని గుర్తించారు. అక్షరాలా వారందూ నిర్ణీత సమయంలో రూ.3.10 కోట్లు చెల్లించాలని డిమాండ్ నోటీసులు జారీ చేశారు. ఇప్పటి వరకూ 4,576 మంది నుంచి రూ.2.23 కోట్లు వసూలు చేసినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. వేసవి నేపథ్యంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిన విషయం విదితమే. అధికారుల గణాంకాల ప్రకారం ఫిబ్రవరిలో రోజువారీ విద్యుత్ వినియోగం సుమారుగా 18 మిలియన్ యూనిట్లు ఉండగా మార్చిలో 20 మిలియన్ యూనిట్లకు పెరిగింది. ఇటీవల రోజువారీ వినియోగం సుమారుగా 24 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. 'అదనపు' వినియోగదారులను గుర్తించి వారి నుంచి అదాయం పొందేలా విద్యుత్ సంస్థ కసరత్తు పూర్తి చేసింది.

'అడిషనల్' బాదుడు

విద్యుత్ సర్వీసు కనెక్షన్ తీసుకునే సమయంలో వినియోగ సామర్థ్యం ఆధారంగా డిపాజిట్ చెల్లించి కనెక్షన్ అందజేస్తారు. తర్వాత కుటుంబ అవసరాలు, ఆర్థిక స్థోమత పెరిగే కొద్దీ అదనపు



పరికరాలు కొనుగోలు చేయడం పరిపాటి. దీంతో విద్యుత్ వినియోగం పెరుగుతుంది. దీంతో విద్యుత్ సంస్థ బాదుడు మొదలవుతుంది. తొలుత కనెక్షన్ తీసుకున్న సమయంలో పేర్కొన్న కెపాసిటీకి మించి విద్యుత్ వాడడంతో కిలోవాట్‌కు అదనంగా డెవలప్‌మెంట్ ఛార్జీలు, సెక్యూరిటీ డిపాజిట్లు, అప్లికేషన్ ఫీజు, సూపర్‌విజన్ ఛార్జీలు, ఎస్‌జిఎస్‌టి, సిజిఎస్‌టి తదితరాల పేరిట మొత్తంగా రూ.1800 వరకూ చెల్లించాల్సి వుంటుంది. ఎసి ఉపయోగిస్తే నెలకు అదనంగా రెండు కిలోవాట్ల విద్యుత్ వాడకం వుంటుంది. దీంతో కొత్తగా ఎసిలు ఉపయోగిస్తున్న వారిని అదనపు మొత్తాలు చెల్లించమంటూ విద్యుత్‌శాఖ నోటీసులు పంపుతోంది. గడువులోగా చెల్లించకుంటే కనెక్షన్ తొలగిస్తామన్న హెచ్చరికలు నోటీసులో ఉంటున్నాయి. సగటున చూస్తే ఎసిలు కొని నెల పాటు వాడిన వారందరికీ కనీసమంటే రూ.4 వేలు చెల్లించాలని నోటీసులు జారీ అవుతున్నాయి.

మధ్యతరగతిపై పెనుభారం

ఎసి బిగించుకుంటే అదనపు వాడకం పేరుతో బాదుడు మొదలవుతోంది. వేసవి నేపథ్యంలో వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు ఉక్కపోతతో సతమతం అవుతుండడంతో అత్యధికంగా మధ్య తరగతి కుటుంబాలు నెలసరి వాయిదాలపై ఎసిలు కొనుగోలు చేస్తున్నారు. వేసవిలో ఎండలు మండిపోతుండడం, ఉక్కపోత, ఫ్యానుగాలి మరింత వేడిని పంచడం వంటి కారణాలతో ఈ వేడిని తట్టుకోలేని ఎసిలు కొనుగోలు చేస్తున్నామని కొనుగోలుదారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పదుల సంఖ్యలో ఏజెన్సీలు, రిటైల్ దుకాణాలు 50 వరకూ ఉన్నాయి. రాజమహేంద్రవరంలోని ఓ ప్రముఖ ఏజెన్సీలోనే గత నెలలో 600 ఎసిలు, ఈ నెలలో 500 ఎసిలు అమ్ముడయ్యాయి. ఎసి వినియోగంతో నెలవారీ కరెంటు బిల్లులు పెరుగుతాయి. అయిదు వందలు దాటని బిల్లులు చెల్లించేవారు కూడా నెలకు రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు చెల్లించక తప్పడం లేదు. వేసవిలో మూడు నెలల పాటు తప్పనిసరై ఈ అదనపు భారాన్ని భరించేందుకు సిద్ధపడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు మధ్యతరగతి ప్రజలను టార్గెట్ చేస్తూ అడిషనల్ పేరుతో షాక్ ఇస్తున్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఇబి సిబ్బంది

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-కొవ్వూరు

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం కొవ్వూరులోని ఎస్ఇబి స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ బిసి సంక్షేమ వసతి గృహంలో మాదకద్రవ్యాల వినియోగం, వాటి దుష్ప్రభావాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ నెల 26న నిర్వహించనున్న ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని కొవ్వూరు బిసి సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల (డ్రగ్స్) వినియోగం, వాటి దుష్ప్రభావాలును వివరిస్తూ అవగాహన సదస్సు నిర్వహించినట్టు తెలిపారు. సమాజానికి నష్టం కలిగించే మాదకద్రవ్యాలను నియంత్రించే విధంగా యువతకు, పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మాదకద్రవ్యాలు వినియోగం వల్ల సామాజిక, మానసిక, శారీరక అనారోగ్యాలు తలెత్తుతాయని, అందుకే దేశభవిష్యత్తును కుంగదీసే మాదకద్రవ్యాలను పకడ్బందీగా అరికడదామన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టంపై ప్రజల్లో అవగాహన పెంచాలని 1987లో ఐక్యరాజ్య సమితి సాధారణ సభ తీర్మానించిందని, ప్రతి ఏటా జూన్ 26న మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నామన్నారు. ఈ అవగాహన సదస్సులో హాస్టల్ వార్డెన్ ఆర్.చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కొవ్వూరు మండలం, వేములూరులో మాదక ద్రవ్యాల వినియోగం, దుష్ప్రభావాలపై ఎస్ఇబి అధికారులు సిబంది, నిర్వహించిన అవగాహన సదస్సులో గ్రామపెద్దలు, యువత పాల్గొన్నారు.

కుంపట్ల అమర్‌నాథ్ స్ఫూర్తినీయుడు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జాతీయ కబడ్డీ క్రీడాకారుడు కుంపట్ల అమర్నాథ్ స్ఫూర్తినీయుడు అని వైసిపి జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని ధర్మంచర కమ్యూనిటీ హాలులో నిర్వహించిన కుంపట్ల అమర్‌నాథ్ సంస్మరణ సభలో జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ జక్కంపూడి రామ్మోహన్‌రావు తన రాజకీయ ప్రస్థానంలో ఎటువంటి ఆర్థిక బలం లేనప్పటికీ స్నేహితుల ప్రోద్బలం, సహకారంతోనే అంచెలంచెలుగా రాజకీయాల్లో ఉన్నత స్థితికి చేరుకున్నారన్నారు. ఆయన స్నేహితుల్లో ఒకరైన అమర్నాథ్‌తో చిన్ననాటి నుంచి అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. అమర్‌నాథ్ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఎందరికో ఆయన స్ఫూర్తిదాయకంగా నిలుస్తారన్నారు. జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ అమర్‌నాథ్ కుటుంబానికి అండగా నిలబడతామన్నారు. రానున్న రోజుల్లో ఆయన పేరున కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు.



అమర్‌నాథ్‌కు నివాళులర్పిస్తున్న జక్కంపూడి రాజా తదితరులు

ప్రతీ సోమవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం



ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానం ద్వారా సోమవారం నుంచి ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరిస్తామని కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. మార్చి నెలలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి స్పందన కార్యక్రమం ద్వారా అర్జీలు స్వీకరించే కార్యక్రమాన్ని నిలుపుదల చేసినట్టు తెలిపారు. స్పందన కార్యక్రమం స్థానంలో నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం 'ప్రజా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదులను' మీ కోసం పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం (పిజిఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు కమిషనర్ ఫిర్యాదులను స్వీకరిస్తామని తెలిపారు. నగరపాలక సంస్థ వివిధ విభాగాలకు చెందిన అధికారులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, ప్రజలు ఈ మార్పును గమనించాలని కోరారు.



పంటకాలువను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ ముప్పిడి

గుర్రపు డెక్క తొలగించాలని ఎంఎల్ఎ ముప్పిడి ఆదేశం

ప్రజాశక్తి కొవ్వూరు రూరల్

కుమారదేవం నుంచి కొవ్వూరు మీదుగా వెళ్ళే పంటకాలువలో గుర్రపుడెక్క తొలగింపునకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఆదివారం ఆయన కుమారదేవం నుంచి కొవ్వూరు మీదుగా వెళ్ళే పంట కాలువలను పరిశీలించారు. రైతులకు ఉపయోగకారిగా పంట కాలువలను సరి చేయడానికి అవసరమైన మేరకు ఉన్నతాధికారులతో మాట్లాడి వరి నాట్లు ప్రారంభమైనందున పంట పొలాలకు అవసరమైన సాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కొవ్వూరులో ఫేజ్-3లోని జగనన్న కాలనీలో వర్షపు నీరు చేరకుండా డ్రెయిన్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ ఛైర్మన్ సూరపనేని చిన్ని, తెలుగుదేశం మండల అధ్యక్షులు వట్టికూటి వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు కొప్పాక విజయకుమార్ తదితరులు ఉన్నారు.

సామాజిక సేవపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విద్యార్థి దశ నుండే సామాజిక సేవపై అవగాహన కలిగి ఉంటే సమాజ అవసరాలు తీర్చవచ్చని రోటరీ ఇన్నర్ వీల్ పూర్వపు జిల్లా అధ్యక్షురాలు జి.లక్ష్మీశ్రీనివాస్ అన్నారు. ఆదివారం లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో ఇంటర్న్‌షిప్ చేసిన విద్యార్థులకు ఉత్తీర్ణతా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ అన్నదానం, మహిళలకు కుట్టు, మగ్గంలో శిక్షణలతో పాటు విద్యార్థులకు సమాజ సేవలో ఉచిత సర్టిఫికెట్ కోర్స్ అందించడం అభినందనీయమన్నారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ వాలంటీర్ ఇంటర్న్‌షిప్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో భాగంగా శిక్షణ పొందిన లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (పంజాబ్), చండీగఢ్ యూనివర్సిటీ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విద్యార్థులకు 15 రోజులుగా స్వచ్ఛంద సేవపై అవగాహన తరగతులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణతా పత్రాలను లక్ష్మీ శ్రీనివాస్‌తో కలిసి రాంబాబు అందించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ డిగ్రీ స్థాయిలో వివిధ కోర్సుల్లో చదువుకుంటున్న వారు సామాజిక సేవపై ఇంటర్న్‌షిప్ కోర్సును స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఉచిత రీతిన అందిస్తుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన సుమారు 5 వేల మంది ఈ ప్రాజెక్టు ద్వారా శిక్షణ పొందారన్నారు. 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు 380 మందికి శిక్షణ అందించామన్నారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, మేనేజర్ హరికష్ణ, ఇలియాస్, సురేష్, బద్రి, జగదీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను అందజేస్తున్న లక్ష్మీశ్రీనివాస్, రాంబాబు



అధ్యక్షునికి శుభాకాంక్షలు తెలుపుతున్న అతిథులు

మానవత కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వడ్లూరులో ఆదివారం మానవత ఉండ్రాజవరం శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ సాగిరాజు జానకిరామరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో కఠారి సిద్ధార్థ రాజు అధ్యక్షునిగా, ఫణితిని పార్వతి, కోడూరి శ్రీనివాసరావు కార్యదర్శి, కోశాధికారులుగా, నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షునికి పలువురు పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 197-75లో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నెలటూరు సీతారామ కళ్యాణ మండపంలో ఉత్సాహంగా సాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పూర్వ విద్యార్థుల కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆనాటి ఉపాధ్యాయులు రత్నబాల, బి.కృష్ణమూర్తి, జి.నాగేశ్వరరావు విజయలక్ష్మి దంపతులను షీల్డ్‌లు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆనాటి మధురస్మృతులు ఒకరికి ఒకరి పంచుకున్నారు. నిర్వాహకులు బిఎస్ఎల్‌వి.ప్రసాద్, జి.బాపూజీ, జి.మనోహర్, షేక్ జానీ బాషా, ఎఆర్ఎస్‌వి.ప్రసాద్, ఎన్.ఉమాదేవి, టి.వీరమణి, ఎ.బేబీ సరోజిని, డి.సరస్వతి తదితరుల ఆధ్వర్యాన ఈ సమ్మేళనం నిర్వహించారు.



తమ గురువులతో పూర్వ విద్యార్థులు



చిన్నారుల మధ్య పుట్టినరోజు వేడుకలు

చిన్నారుల మధ్య ఘనంగా పుట్టినరోజు

తాళ్లపూడి : తల్లిదండ్రులందరూ తమ పిల్లల పుట్టినరోజు వేడుకలను చిన్నారుల మధ్య జరుపుకుంటే వారి మధ్య చిన్నతనం నుండి స్నేహభావం పెరుగుతుందని మలకపల్లి అంగన్‌వాడీ టీచర్ అన్నారు. గ్రామానికి చెందిన రాగు రమేష్ మౌనిక దంపతులు తమ కుమార్తె తనూజ పుట్టిన రోజును అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన లయన్స్ క్లబ్ కార్యవర్గం

లయన్స్ కార్యవర్గానికి ఎంఎల్ఎ అభినందన

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

కొవ్వూరు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైన నేపథ్యంలో కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అభినందనలు తెలిపారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నూతన అధ్యక్షులకు, కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా చేస్తున్న సేవల గురుంచి తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. వారికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. అనంతరం లయన్స్ క్లబ్ ఇన్‌స్టాలేషన్అండ్ ఇన్‌డక్షన్ ఆఫీసర్ కొత్తపల్లి రవి కుమార్ నూతన కార్యవర్గం అధ్యక్షునిగా ఎన్నికైన ఎంవివి.సత్యనారాయణ, కార్యదర్శిగా ఎన్నికైన ఎన్.బుల్లిరాజు, కోశాధికారి ఎన్.వి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు మద్దిపట్ల శివరామకృష్ణ, లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు పాలెంపాటి చినబాబు తదితరులు పాల్గొన్నారు.


కార్టూ'నిజం'



పవన్ ఆశయానికి ఆదిలోనే తూట్లు

ప్రజాశక్తి-కడియం

కోటి ఆశలతో రాజకీయ రంగ ప్రవేశం చేసిన పవన్ కళ్యాణ్ ఆశయానికి ఆదిలోనే తూట్లు పడే పరిస్థితి వచ్చింది. గత ప్రభుత్వం చేసిన అనేక తప్పిదాల్లో మొదటిగా చెప్పు కొనేది ఇసుక దోపిడి ఒకటి. తాజాగా ఎన్నికైన ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఇంటా బయటా విమర్శలు పాలవుతోంది. మళ్లీ మనమే వస్తాం అంటూ రూ.కోట్ల విలువైన ఇసుకను గత ప్రభుత్వం గోదావరి నది చెంతన భారీగా నిల్వ చేసింది. అది తాజాగా ఎన్నికైన కొత్త ప్రభుత్వంలోని కొందరికి వరంగా మారింది. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే తమ పంజా విసురుతున్నారు. ఏమాత్రం లెక్కా పత్రాలూ లేకుండా ఇష్టానుసారంగా రేయింబవళ్లు ఎంఎల్ఎ పేరు చెప్పి అమ్మేస్తున్నారు. రూ.కోట్లల్లో ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం, తాతపూడి రీచ్‌లో దోపిడీని ప్రతిపక్ష నేతలు బహిర్గతం చేయడంతో అక్కడ తవ్వకాలు నిలిచినప్పటికీ, మండలంలోని బుర్రిలంక - వేమగిరి ర్యాంప్‌లో మాత్రం యథేచ్ఛగా అమ్మకాలు సాగుతున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం స్పందించడం లేదు. స్థానికులు చేస్తున్న విమర్శలతో కరుడుగట్టిన జనసైనికులు తలలు పట్టుకుంటున్నారు. ఎంఎల్ఎ గోరంట్ల తక్షణం ఇసుక అమ్మకాలను నిలిపివేయించి పేదవాడికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



వేమగిరి ర్యాంప్‌లో ఇసుక నిల్వలు

వైసిపి కేంద్ర కార్యాలయం కూల్చివేత దారుణం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

వారి పాలనలో కక్షపూరిత చర్యలు ఉండవంటూనే, వచ్చీరాగానే తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయాన్ని కూలదోయడం చాలా దారుణమని మాజీ ఎంపీ మార్గాని భరత్ ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వం జిఒ విడుదల చేసిన తరువాత చట్టబద్ధంగా, లీజుకు తీసుకున్న స్థలంలో, దాదాపు రెండస్తులు పూర్తయిన వైసిపి కార్యాలయాన్ని అకారణంగా కూల్చివేయడం దారుణమన్నారు. గతంలో ఉన్న ప్రజావేదిక ఎన్‌జిటి రూల్స్‌కు వ్యతిరేకంగా, చట్టబద్ధత లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నదీ పరివాహక ప్రాంతంలో ప్రభుత్వ పాలనకు, ఏ మాత్రం అనుకూలంగా లేనందున దాన్ని తీసి వేయాల్సి వచ్చిందని తెలిపారు. కానీ, ఏ మాత్రం కక్ష సాధింపుతో వ్యవహరించలేదన్నారు. టిడిపి హయాంలో 2014-2019లో 12 చోట్ల శ్రీకాకుళం, విజయనగరం, గుంటూరు, కడప, మచిలీపట్నం, ప్రాంతాల్లో ఆ పార్టీ కార్యాలయాల నిర్మాణం నిమిత్తం ఎకరాలు, ఎకరాలు కేటాయించారన్నారు. ఎకరానికి నామినల్‌గా రూ.వెయ్యి మాత్రమే ధర నిర్ణయించారని, తన దగ్గర రికార్డు కూడా ఉందని తెలిపారు. చట్టబద్ధంగా తాడేపల్లి స్థలం లీజుకు తీసుకున్నామని, దాని ద్వారా గవర్నమెంట్‌కు రెవెన్యూ వస్తున్నప్పుడు, దీంట్లో తప్పేముందని అన్నారు. ఈ దుశ్చర్యకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని నిలదీశారు.



కన్నబాబును సత్కరిస్తున్న డీలర్స్

కన్నబాబును కలిసిన రేషన్ డీలర్స్

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని కృష్ణునిపాలెంలో తెలుగుదేశం పార్టీ క్లస్టర్-1 ఇన్‌ఛార్జి కన్నబాబును ఆదివారం ఆయన స్వగృహంలో మండల రేషన్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ విజయం కోసం నాయకులు, కార్యకర్తలను కలుపుకుని భారీ మెజారిటీతో విజయం సాధించడంలో కన్నబాబు కీలక పాత్ర పోషించారని అభినందించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



ప్రజాశక్తితో డిఇఒ పిల్లి రమేష్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి



ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన, నాణ్యమైన విద్య అందుతుందని, పలు స్కూళ్లలో అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని కాకినాడ జిల్లా విద్యాశాఖ అధికారి పిల్లి రమేష్ అన్నారు. స్టూడెంట్ కిట్స్ పంపిణీ ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో రోజురోజుకూ భరోసా పెరుగుతుందన్నారు. ఫీజుల భారం భరించలేక జిల్లా వ్యాప్తంగా ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు సర్కారు బడుల్లో చేరుతున్నారన్నారు. ఇంకా పలు అంశాలను ఆయన ప్రజాశక్తితో పంచుకున్నారు.

రెండో విడత నాడు-నేడు పనులు ఎంతవరకు వచ్చాయి..?

జిల్లాలో రెండో దశలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు అభివృద్ధి పనులతో సమూల మార్పులు జరుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావడానికి నాడు-నేడు ఎంతగానో తోడ్పడుతుంది. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అన్ని వసతులు కల్పిస్తున్నాం. రూ.133.27 కోట్లతో రెండో విడతలో జిల్లా వ్యాప్తంగా 881 పాఠశాలల్లో పనులు చేయాలని ప్రతిపాదించి మొదలు పెట్టారు. ఇప్పటి వరకు 50 శాతం పనులు పూర్తి అయ్యాయి. త్వరలోనే మిగిలిన పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఏయే వసతులు కల్పిస్తున్నారు.?

పిల్లలకు అవసరమైన వసతులన్నీ సమకూరుస్తున్నాం. మరుగుదొడ్లు, ప్రహరీలు, ఆట వస్తువులు, సైకిల్ షెడ్లు, తాగునీరు, బెంచీలు, గ్రీన్ బోర్డులు, ఫ్లోరింగ్ టైల్స్, మొక్కలు, ప్రతి పాఠశాలకు స్మార్ట్ టీవీ సమకూరుస్తున్నాం. భవిష్యత్తులో పిల్లలు బాధ్యతగా మెలిగేందుకు వారిని భాగస్వామ్యం చేసేలా కమిటీలు వేస్తాం.ఉపాధ్యాయుల కమిటీలను కూడా త్వరలో ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

జిల్లాలో స్టూడెంట్ కిట్స్ ఎన్ని వచ్చాయి.ఇంకా ఎన్ని రావాల్సి ఉంది.?

జిల్లాకు 12,34,513 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా ఇప్పటి వరకు 10,12,333 (82 శాతం) పుస్తకాలు వచ్చాయి. ఇంకా 2,22,180 పుస్తకాలు రావాల్సి ఉంది. అవసరమైన నోటు పుస్తకాలు అన్నీ చేరుకున్నాయి. 1,38,065 జతలు యూనిఫామ్ అవసరం కాగా 24,183 (17.52 శాతం) రాగా ఇంకా 1,13,882 జతలు రావాల్సి ఉంది. 1,38,056 బ్యాగ్స్ అవసరం కాగా ఇప్పటి వరకూ 17,492(12.67 శాతం) వచ్చాయి. ఇంకా 1,20,573 బ్యాగులు రావాల్సి ఉంది. 90,796 బెల్టులు రావాల్సి ఉండగా 75,572 (83.23శాతం) వచ్చాయి. ఇంకా 15,224 రావాల్సి ఉంది. అలాగే షూలు 1,38,065 అవసరం కాగా ఇప్పటి వరకు 1,37,627 (99.68 శాతం) వచ్చాయి. ఇంకా 438 షూలు రావాల్సి ఉంది. ఆక్స్ ఫార్డ్ డిక్షనరీలు పూర్తిస్థాయిలో రావాల్సి ఉంది. వచ్చిన వాటిని ఇప్పటికే ఆయా మండలాల్లో పాఠశాలలకు తరలించడంతో బాటు విద్యార్థులకు పంపిణీ కూడా చేశాం.

స్టూడెంట్ కిట్లలో ఏవేవి ఉంటాయి.?

మరో వారం,పది రోజుల్లోనే స్టూడెంట్ కిట్స్ పంపిణీ పంపిణీ పూర్తి చేస్తాం. ఈ కిట్లలో మూడు జతల యూనిఫామ్స్, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, ఒక సెట్ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్ వంటివి ఉంటాయి. బాలురకు స్కై బ్లూ రంగు, బాలికలకు నేవీ బ్లూ రంగు బ్యాగులు అందించాము.

పాఠశాలల్లో పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు వస్తున్నాయి. వీటిని ఎలా సరిదిద్దుతారు.?

అధికారులు విధిగా పాఠశాలలకు వెళ్లి పర్యవేక్షించాల్సిందే.అక్కడ లోటుపాట్లను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలి. జాబ్ చార్టు ప్రకారం పాఠశాలలు తనిఖీ చేసి ఉన్నతాధికారులకు నివేదించాలి. ఇప్పటికే జిల్లా, ఉప, మండల విద్యాశాఖాధికారులు, సెక్టోరియల్ అధికారులు తప్పక పర్యవేక్షించాలని ఆదేశించాం. నిర్లక్ష్యం చేసిన వారిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటాం.

నో స్కూల్ బ్యాగ్ డే ఎలా అమలవుతుంది.?

ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు వారంలో ఒక రోజు అయినా చిన్నారులకు పుస్తకాలు మోసే బరువును తగ్గించాలని ప్రభుత్వం భావించింది. అందుకే నో స్కూల్ బ్యాగ్ డే విధానంలో భాగంగా నెలలో మొదటి, మూడు శనివారాల్లో స్కూల్‌కు చిన్నారులు బ్యాగ్ లేకుండా వెళ్ళాలని ప్రభుత్వం నిర్ణయించి అన్ని విద్యాసంస్థలకు ఆదేశాలను కూడా జారీ చేసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. విశాఖ జిల్లా భీమునిపట్నం ప్రాంతంలోని తగరపువలస గ్రామానికి చెందిన దుర్గాసి చిన్ని యానం వైపు నుంచి కాకినాడ వస్తూ డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గాయపడిన ఆ యువకుడుని సమీప ఆసుపత్రికి హైవే పోలీసులు తరలించారు.

జన జాతర సభ విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి - సామర్లకోట



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఈడిముడి గ్రామంలో జూలై 7న తలపెట్టిన మాదిగ జన జాతర సభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు కాల లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక భీమవరం పేటలో మాదిగ జన జాతరకు చెందిన కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఆర్‌సిఎస్ రాష్ట్ర కో కన్వీనర్ వల్లూరి నాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల పోరాటంలో జరిగిన ఆటుపోట్లు సమీక్షించుకుని చిరకాల స్వప్నమైన వర్గీకరణ సాధనకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నందిక చక్రం, నాయకులు వేలంగి సత్తిబాబు, సూర్యారావు, చెన్నా రాజు, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు అంబేద్కర్ పేరు పట్ల హర్షం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గత ప్రభుత్వం విదేశీ విద్య పథకానికి అంబేద్కర్ పేరు తొలగించి, జగనన్న విదేశీ విద్యగా పేరు మార్చిన నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం మళ్లీ ఆ పథకానికి అంబేద్కర్ విదేశీ విద్యగా మార్చడం అభినందనీయమని ఎంఆర్‌పిఎస్ నాయకుడు, న్యాయవాది బొల్లిపో సునీల్‌రాజ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయమై అనేకసార్లు దళిత సంఘాలన్నీ మొర పెట్టుకున్నప్పటికీ అంబేద్కర్ పేరు పెట్టడంపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్పందించలేదన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు అంబేద్కర్ పేరును కొనసాగించాలని జిఒ విడుదల చేయడం పట్ల సునీల్ రాజ్ హర్షం వ్యక్తం చేశారు.

వర్షాకాలంలో పోషకాహారం తప్పనిసరి

కాకినాడ రూరల్ : వర్షాకాలంలో రోగ నిరోధక శక్తి తగ్గుతుందని, కాబట్టి పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని పోషకాహార నిపుణులు పి.పార్థసారథి సూచించారు. ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో దాహం వేయక పోయినా మంచినీళ్లు తాగాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విటమిన్ సి ఎక్కువగా ఉండే తాజా పండ్లను తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవకుల కృషి అభినందనీయం

కాకినాడ రూరల్ : దేశాభివృద్ధికి ప్రభుత్వ సేవకులు అందిస్తున్న సేవలు అభినందనీయమని న్యాయవాది పెండెం శ్రీదేవి కొనియాడారు. ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాసేవ దినోత్సవంలోఆమె మాట్లాడారు. సమాజానికి 2002 నుంచి జూన్ 23న ప్రపంచ పబ్లిక్ సర్వీస్ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. కొంతమంది ప్రభుత్వ శాఖల ద్వారా సేవ చేస్తుంటే మరి కొంతమంది స్వచ్ఛందంగా సామాన్య ప్రజలకు సేవ చేస్తున్నారని శ్రీదేవి తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

సీజనల్ వ్యాధులు పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం డివిజనల్ పంచాయతీ అధికారి బాలామణి అన్నారు. ఆదివారం మండలంలోని పులిమేరు గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించి మంచినీటి సరఫరా విభాగాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ మార్పులను బట్టి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పారిశుధ్యం పట్ల, పరిసరాల పరిశుభ్రత పట్ల, స్వచ్ఛమైన తాగునీటి పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏరోజు చెత్త పోగులను ఆ రోజే తొలగించాలని, డ్రెయిన్లను ప్రతిరోజు శుభ్రం చేయించాలని, స్వచ్ఛమైన తాగునీటి సరఫరాపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణ, సచివాలయ ఇంజనీరింగ్ అధికారి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు, దాతలు

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీ అడబాల ట్రస్ట్ కార్యాలయంలో విశ్రాంతి తహశీల్దార్ రేలంగి బాపిరాజు సౌజన్యంతో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పాలన సంక్షేమ అధికారి సిహెచ్.వెంకటరావు మాట్లాడుతూ సంపాదనతోపాటు పదిమందికి సహాయపడటంలోనే ఆనందం ఉంటుందన్నారు. దీనిని జీవన విధానంగా మార్చుకోవాలని సూచించారు. సాయం చేసే గుణం ప్రతి ఒక్కరిలో పెరగాలని అన్నారు. బాపిరాజు సేవా గుణాన్ని వెంకటరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ఫోటో స్టూడియోలో చోరీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక తహశీల్దార్ కార్యాలయం సమీపంలోని శ్రీ బాలాజీ ఫొటో స్టూడియోలో ఆదివారం తెల్లవారుజామున దుండగులు ప్రవేశించి ఖరీదైన కెమెరాలు, నగదు దొంగిలించినట్లు యజమాని సత్యవరపు దుర్గారావు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం షాపు తెరిచి చూడగా విలువైన కెమెరాలు, రూ 10 వేలు నగదు దొంగిలించినట్లుగా గుర్తించి వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.